
**కథ**

## దీక్షితుల వాణీప్రభ




"రేపు మా పెదనాన్నా వాళ్లు మనింటికి వస్తున్నారట!" అప్పుడే వచ్చి చెప్పులు విడుస్తున్న రాంబాబు మాస్టారు, భార్య మాటలకి ప్రశ్నార్థకంగా చూశారు.

"మా పెదనాన్నగారి ఫామిలీ అమెరికా నుంచి మొన్ననే మా ఊరొచ్చారట. మన ప్రత్యూష విషయం గానీ తెలిసిందో ఏమో మధ్యాహ్నం ఫోను చేశారు రేపు ఉదయమే వస్తామని" మళ్లీ వివరణ ఇచ్చింది అతని ప్రశ్నార్థకానికి భార్య కళ్యాణి.

రాంబాబు మాస్టారు లెక్కలు చెప్పటంలో దిట్ట అయినా బతుకులెక్కలు రాసుకోవడంలో మాత్రం కొద్దిగా పూర్. అయినా రోజురోజుకీ పెరిగిపోతున్న జీవన వ్యయంతో ఒక్క మనిషి జీతంతో జీవన ప్రమాణం పెంచుకోవడం కష్టమే మరి. ఉన్న ఇద్దరాడ పిల్లల్లో పెద్దపిల్లని చదువుకున్నంత వరకూ చదివించి పెళ్లి చేసి బాధ్యత తీర్చుకున్నారు. రెండో పిల్ల ప్రత్యూష డిగ్రీ చదువుతోంది. భార్య కళ్యాణి కాస్త మాటకారితనం ఉన్నా మనసు మంచిదే. డెయిలీ లైఫ్‌లో ఏ సమస్యలూ లేని చిన్న సంసారం.

అయితే పది రోజుల క్రితం ప్రత్యూష కాలేజీలో కళ్లు తిరిగి పడిపోవడంతో మొదలైంది అసలు సమస్య అంతా. డాక్టరు పది రోజుల్లో ఆ అమ్మాయికి చిన్న సర్జరీ చేయాలనీ లేకపోతే తరచుగా ఇలాగే జరుగుతూ ఉంటుందనీ చెప్పడంతో రాంబాబుగారి గుండె ఒకసారి ఆగి మళ్లీ కొట్టుకోవడం మొదలైంది. నెలవారీ జీతంతో గుట్టుగా కాలక్షేపం చేసే వాళ్లకి లక్ష రూపాయలంటే సమస్యే మరి. పైగా ఈమధ్యనే అమ్మాయి పెళ్లి. బాంక్ బాలన్స్ నిల్లు అయ్యింది. మాస్టారికి వందల కొద్దీ స్టూడెంట్లున్నారు తప్ప వంద నోట్ల కట్టలు లేవు. నాలుగు రోజులు తిరిగి పర్సనల్ లోన్ పెట్టి యాభై వేలు సంపాదించాడు. తక్కినవి ఎలా సర్దుకోవాలో ఆలోచిస్తూ పార్కులో కూర్చుని కూర్చుని ఇప్పుడే ఇల్లు చేరాడు నెమ్మదిగా.

అతనేం మాట్లాడకపోవడంతో కళ్యాణి "మా పెదనాన్న అమెరికాలో కోట్లు గడించాడు. మన పిల్ల సంగతి తెలిసి చూడాలని వస్తున్నారంటే ఆపరేషన్‌కి డబ్బులు సర్దడానికే అయ్యుంటుంది. ఆయనకి ఇదో పెద్ద లెక్కా ఏమిటి? ఏవేవో ఫౌండేషన్లకి డొనేషన్లు అవీ కూడా ఇస్తాడుట" అంటూ కంటిన్యూ చేయబోయింది.

ఆ మాటలకి మాస్టారి మొహంలో కొంచెం వెలుగొచ్చింది. "నిజమేనంటావా?" అన్నాడు సాలోచనగా.

"నిజం కాకపోతే ఇన్నేళ్లుగా రానివాడు ఇప్పుడు మనింటికి ప్రత్యేకంగా ఎందుకొస్తాడంటారూ? మీరు కాస్త టీ తాగి నీరసం వదిలించుకుని, అలా కిరాణాషాపు వరకూ వెళ్లి అవసరమైన సరుకులు తెచ్చిపెట్టండి" అని ఆర్డరేసి వంటింట్లోకి వెళ్లి టీ పట్టుకొచ్చింది. దానితో పాటే లిస్టూ, బ్యాగూ.

జీడిపప్పూ, కిస్‌మిస్, నెయ్యి, ఏలకులు, వక్కపొడి ఇలా సాగిపోతున్న లిస్ట్ చూసి కంగారుపడి జేబులు తడు

ముకుంటున్న మాస్టారిని చూసి "మర్చిపోయాను- మధ్యాహ్నం టీ తాగాక తినడానికి అరకేజీ రంగోలీ స్వీటూ, బొంబాయి మిక్చరూ కూడా పట్టుకురండి" అంటూ మరో బాంబు పేల్చింది.

'ఇప్పుడివన్నీ అవసరమా?' అన్నట్లు చూస్తున్న మాస్టారిని గమనించి "మనింటికి వచ్చిన వాళ్లకి మంచి భోజనం అయినా పెట్టొద్దా? అయినా యాభైవేలు ఇస్తున్నప్పుడు ఈమాత్రం తప్పదు. అన్నట్లు సందు చివర కూరలమ్మే వాడిని ప్రొద్దున్నే ఒక కేజీ పనసపొట్టు ఇచ్చి వెళ్లమనండి" ఇంకా కాసేపుంటే బొత్తిగా జేబుకి చిల్లే అన్నట్లు గబగబా బయటకి నడిచాడు రాంబాబు మాస్టారు.

పెదనాన్న ఫామిలీ కారు దిగేసరికి ఘుమఘుమలాడుతూ వెజిటబుల్ బిర్యానీ, ఆలూకూర్మాతో పాటు వాళ్లకిష్టమైన పనసపొట్టు కూర, ములక్కాడ సాంబారు, దోసావకాయ, గులాబ్‌జాం, బాగా నెయ్యి జీడిపప్పు దట్టించిన చక్రపొంగలి, గడ్డపెరుగు అన్నీ వండి టేబుల్ మీద నీట్‌గా సర్దేసిన కళ్యాణి మనసులో ప్రత్యూష అనారోగ్యం ముల్లులా గుచ్చుతూనే ఉంది. నాలుగు రోజులుగా సరిగా అన్నమే తినని ఆమె వాళ్లని సంతోషపెట్టాలని అన్నీ శాస్త్రోక్తంగా వండి వార్చింది.

సాంప్రదాయక భోజనంతోపాటు అమెరికన్ స్టైల్‌లో సిద్ధం చేసిన డిన్నర్ సెట్, కత్తులూ, ఫోర్కులూ చూసి వాళ్లంతా చాలా సంతోషించారు. పెద్దమ్మ అమెరికా నుంచి ప్రత్యేకంగా తెచ్చిన సిల్కు నాప్‌కిన్ల సెట్టు కళ్యాణి చేతిలో పెట్టింది. పెదనాన్న కొడుకు స్టైల్‌గా వాక్‌మన్ వింటూ కాళ్లూపుతూ మధ్యమధ్యలో ప్రత్యూష అనారోగ్యం గురించి ఎంక్వయిరీ చేశాడు. అమెరికా వాళ్ల పద్ధతులు, డిసిప్లిన్, అక్కడ ఇండియన్స్ పడే బాధలూ విడతలు విడతలుగా వివరిస్తున్న వాళ్ల మాటలకి మనసులో చిరాగ్గా ఉన్నా పైకి మాత్రం కుతూహలం నటిస్తున్నారు మాస్టారు.

భోజనం చేసినంతసేపూ కళ్యాణి చేతివంటని మెచ్చుకుంటూ సుష్టుగా భోంచేశారు. భోజనాలయ్యాక తాంబూలాలు నమిలి కాసేపు విశ్రమించి లేచి జాంగ్రీ, మిక్చరూ స్వీకరించి కళ్యాణి పెద్దమ్మ "మొత్తానికి మా కళ్యాణి తెలివైనదే కాక ధైర్యవంతురాలు కూడానూ. ఒక పక్క పిల్ల అంత జబ్బుతో బాధపడుతుంటే అన్ని ఏర్పాట్లు ఇంత పకడ్బందీగా చేసిందంట. ఎంత ధైర్యస్థురాలూ.. మరొకరైతే నీరైపోదురు" అంటూ కితాబిచ్చింది. అది అభినందనో, అభిశంసనో తెలీక దంపతులిద్దరూ మొహామొహాలు చూసుకున్నారు. వాళ్లు డబ్బు మాట ఏమీ ఎత్తకుండానే వెళ్లిపోవడానికి రెడీ అవుతుంటే ఉండబట్టలేక మాస్టారు ఏదైనా డబ్బు సాయం చేస్తే మళ్లీ ఒక ఏడాదిలోగా తీర్చేస్తానని సన్నగా అర్థించారు. తెచ్చుకున్న డాలర్లతో సొంత ఊర్లో పొలాలు కొన్నాననీ, అమెరికా వెళ్లాక ఆలోచిస్తానని సమాధానమిచ్చాడాయన.

కళ్యాణి పెద్దమ్మ లక్ష రూపాయల కెంపుల నెక్లెస్సూ, లేత గులాబీరంగు పట్టుచీరా కట్టుకుని పక్క ఊరిలో ఉన్న వియ్యాల వారింటికి వెళ్లడానికి రెడీ అయింది. వెళ్తూ వెళ్తూ పర్సులో నుంచి అయిదొందల నోటు తీసి కళ్యాణి చేతిలో పెట్టి నిజానికి నువ్వు పెట్టిన భోజనం వెయ్యి రూపాయలిచ్చినా తినలేమనుకో అంది. అంటే నేను పెట్టిన భోజనానికి ఖరీదు కట్టి అయిదు వందలిచ్చారా అన్నట్లు కళ్యాణి మొహం వాడిపోయింది. ఎప్పుడూ కక్కుర్తిపడని తను వాళ్ల డబ్బులిస్తారని ఆశపడినందుకు మాస్టారు ఎంతో సిగ్గుపడ్డారు.

వాళ్లని పంపించి ఇంట్లోకి రాగానే మళ్లీ మిగిలిన ఎమౌంట్ ఎలా సంపాదించాలన్న సమస్య బుర్రని దొలిచెయ్యడం మొదలెట్టింది.

ఇంతలో మళ్లీ ఫోను మోగింది. మాట్లాడి పెట్టేసిన మాస్టారు భార్యకేసి చూసి "రేపు ఉదయం మా రాజు వస్తున్నాడట" అన్నారు నిర్లిప్తంగా. ఒక్కసారిగా ఉలిక్కిపడిన కళ్యాణి వెంటనే రియాక్టవుతూ... "వచ్చిపోయే వాళ్లకి వండిపెట్టను సరిపోతోంది నా బ్రతుకు. మొత్తం ఫామిలీ అంతా దిగబడతారో ఏమిటో- అవతల పిల్లదాని ఆపరేషనూ అదీ ఇబ్బంది- ఈ ఖర్చులన్నీ ఎవరు భరించగలరూ?" అంటూ విరుచుకు పడింది.

సదరు రాజు మాస్టారి తమ్ముడు. డిగ్రీ వరకు చదివినా ఊళ్లో ఉన్న పొలం కౌలుకిచ్చే కంటే దగ్గరుండి పండించుకోవడం మేలని ఉద్యోగ ప్రయత్నాలేం చేయకుండా అక్కడే ఉండిపోయాడు. పల్లెటూళ్లో ఉన్న ఉమ్మడి ఇల్లు, అయిదెకరాల పొలం అన్నీ అతనే అనుభవిస్తున్నాడు. ఇల్లు వాటాలేసినా అదేం లంకంత కొంప కాకపోవడంతో తన వాటాకి వచ్చిన వరండా, మధ్య గది, వంటిల్లు అద్దెకి ఇచ్చుకునే వీలుగా లేకపోవడంతోనూ ఇల్లు మొత్తం తమ్ముడినే వాడుకోమన్నారు మాస్టారు. అది లక్ష్మికి కోపకారణం. పదేళ్ల క్రితం ఒకసారి వచ్చి ఫ్యామిలీతో పదిరోజులున్నందుకు పదేపదే దెప్పుతూ ఉంటుంది ఇప్పటికీ. ప్రత్యూష విషయం ప్రత్యేకించి ఎవరికీ చెప్పకపోయినా అందరికీ తెలవనే తెలిసింది.

పెదనాన్నగారి ఫామిలీ తిని వెళ్లగా మిగిలిన కూర, సాంబారు, స్వీట్లు ఫ్రిజ్‌లో దాచింది కళ్యాణి.

మర్నాడు ఉదయం పదయ్యేసరికి రానే వచ్చాడు రాజు. "పిల్లలనీ మా చెల్లినీ తీసుకురాకపోయావా?" అని ఆప్యాయంగా పలకరించింది కళ్యాణి.

"అబ్బే! ఇప్పుడేమన్నా పెళ్లా పేరంటమా వదినా అందరినీ తీసుకుని రావడానికి. ఎలా ఉంది ప్రత్యూషకి. ఆపరేషన్ ఎప్పుడు చేయిద్దామనుకుంటున్నారు అన్నయ్యా! ఎంత ఖర్చవుతుంది?" అని వదినగారిచ్చిన వేడివేడి టీ తాగుతూ అన్నగారిని కుశల సమాచారం అడిగాడు.

ప్రత్యూష పక్కనే సోఫాలో కూర్చుని "ఫర్వాలేదు తల్లీ! అంతా త్వరలోనే సర్దుకుంటుంది - మళ్లీ నువ్వు మామూలుగా కాలేజీకి వెళ్లిపోవచ్చు" అంటూ ధైర్యం చెప్పాడు.

పొలం గురించి, ఊళ్లో కబుర్లు చెప్పుకున్నారు కాసేపు అన్నదమ్ములిద్దరూ. ఒక గంట అయ్యాక ఇంక వెళ్లి వస్తానని బయల్దేరాడు రాజు. భోజనం చేసి వెళ్లమని ఏకకంఠంతో చెప్పారు ఇద్దరూ. అయినా సరే ఒప్పుకోలేదు. "అతిథి మర్యాదలకి ఇది సమయం కాదు. ఆపరేషన్ ముందు చెప్తే వచ్చి నాలుగు రోజులు ఉంటాను సహాయంగా" అని సున్నితంగా తిరస్కరించాడు.

లేచి నిలబడి "కాసిన్ని మంచినీళ్లు ఇవ్వు వదినా" అంటూ కళ్యాణిని లోపలకి పంపించి బేగ్‌లో నుంచి అయిదు వందల రూపాయల నోట్ల కట్ట తీసి అన్నగారి చేతిలో పెట్టాడు రాజు. డబ్బు మాట వినబడదంతో గుమ్మం దగ్గరే ఆగిపోయింది కళ్యాణి.

"నాన్న నీకు రాసిన వాటా కూడా పైసా అద్దె లేకుండా నేనే వాడుకుంటున్నాను. అందుకే చాలా కాలంగా నెలకి అయిదు వందల రూపాయలు ప్రత్యూష పేరు మీదుగా ఆర్.డి. కడుతూ వచ్చాను. సరిగ్గా అది ఈ నెలకి మెచ్యూర్ అయ్యి యాభైవేలు చేతికి అందాయి. నిజానికి ఇది డిపాజిట్ చేసి దాని పెళ్లిలో ఇవ్వాలనుకున్నాను కానీ ఇప్పుడు అవసరానికి నువ్వు వెతుక్కోకుండా ఉపయోగపడుతుందని పట్టుకొచ్చాను. మొన్ననే పిల్ల పెళ్లి చేసిన నువ్వు డబ్బు ఇబ్బందిలో ఉంటావేమోనని ఊహించాను. నా ఊహ నిజమే అయింది" అంటున్న రాజుని చూసి అభిమానమో ఆనందమో తెలీని స్థితిలో తమ్ముడిని గట్టిగా కౌగిలించుకుని బోరుమన్నారు రాంబాబు మాస్టారు.

"మనలో మనకి మొహమాటం ఏమిటి అన్నయ్యా - సామాన్యుడి కష్టాలు సామాన్యుడికే తెలుస్తాయి అని ఇవన్నీ నాకూ మామూలే. ఉంచు" అని బలవంతంగా డబ్బు లిస్తున్న రాజుని చూసి మనసు మరింతగా కదిలిపోయింది మాస్టారికి. ఆప్యాయంగా అన్న భుజం తట్టి వెళ్లి వస్తానంటున్న రాజుని చూసి కళ్యాణికి నోటమాట రాలేదు. ఫ్రిజ్‌లో దాచిన కూర, సాంబారు తనని వెక్కిరిస్తున్నట్లు అనిపించింది. తన అంచనా తప్పయినందుకు సిగ్గేసింది.

